# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-06-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పౌరసరఫరాల శాఖ సహా పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తారు.**
2. **రాష్ట్ర పర్యటకాభివృద్ధికి దోహదపడేలా మచిలీపట్నంలో బీచ్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**
3. **రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు**
4. **రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పౌరసరఫరాల శాఖపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. చౌక ధర దుకాణాల ద్వారా రేషన్ సరకుల పంపిణీపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకోనున్నారు. అనంతరం రాష్ట్రంలోని నౌకాశ్రయాలు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకోనున్నారు.

-------------------------

మసులా బీచ్ ఫెస్ట్-2025లో భాగంగా కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఈరోజు 2కె పరుగును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చలన చిత్ర నటులు మంచు మనోజ్, నారా రోహిత్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మచిలీపట్నం పర్యటకాభివృద్ధికి దోహదపడేలా బీచ్ ఫెస్ట్ ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఫెస్టివల్‌లో రైడ్, పారా గ్లైడింగ్, స్పీడ్ బోట్, జెట్ సీ, బంగీ లాంటి క్రీడలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్... 31 సెకన్లు

-------------------------

రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న గృహాలను ప్రతిరోజు 2వందలు చొప్పున పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్మాణంలో ఉన్న గృహాలు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో నిన్న దృశ్యమాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తికాని గృహాల పురోగతిపై నిరంతరం జిల్లా అధికారులు పర్యవేక్షించాలని తెలియజేశారు. 2026 సంవత్సరం మార్చి నాటికి నిర్మాణాలను పూర్తి చేసేలా, అందుకు అనుగుణంగా అధికారులు సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. శ్రీకాకుళం జిల్లాలోని పెదగనగల్ల పేటలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్... 24 సెకన్లు

---------------------------

పంటల దిగుబడి పెంచేందకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వికసిత సంకల్ప అభియాన్ రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.త్రినాథ స్వామి అన్నారు. శ్రీకాకుళంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, ఈ నెల 12వ తేదీ వరకు కృషి విజ్ఞాన కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లోకి వ్యవసాయ రంగ నిపుణులు వెళ్లి రైతులకు అధిక దిగుబడులు పంటలుపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

---------------------------

“ఆక్యులర్ ట్రోమా” అని పిలిచే కంటి గాయాల కారణాలు, నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను జాతీయ మానవ హక్కుల కమిషన్-ఎన్ హెచ్ ఆర్ సి నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కంటి గాయాలకు సంబంధించిన ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు పలు సూచనలు చేస్తోంది. క్రీడలు, ప్రమాదకర పని సమయంలో రక్షణ కళ్ళాద్దాలను తప్పనిసరిగా ఉపయోగించాలని, కంటి గాయానికి కారణమయ్యే బాణసంచా నిషేధం అమలు చేయడం వంటివి చేపట్టాలని తెలిపింది.

---------------------------

సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసే లక్ష్యంతో ఏటా జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. రవాణాకు ఉపయోగించే ముఖ్యమైన వాటిలో సైకిల్ ఒకటి. ఇవి అన్ని రకాల ప్రజలకు అందుబాటు ధరల్లో లభ్యమవడమే కాక, మంచి వ్యాయామ సాధనం కూడా. శారీరక శ్రమను అందించి.. ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అయితే మారుతున్న జీవన విధానాల కారణంగా ప్రజలు సైకిళ్ల వాడకాన్ని తగ్గించి, వాటి స్థానంలో మోటార్ వాహనాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీని వల్ల వాయు, ధ్వని కాలుష్యాలు

అధికమయ్యాయి. ఈ పరిస్థితులన్నింటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ రోజు నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం.

---------------------------

క్షయ నివారణకు అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈ రోజు నుంచి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన అధికారి అనుపమ జేమ్స్ తెలిపారు. అనంతపురంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కార్యక్రమ ప్రచార చిత్రాలను ఈరోజు ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనుపమ మాట్లాడుతూ, క్షయ వ్యాధి నివారణ పై జిల్లాలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు సమీపంలో నిన్న రహదారి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఈ రోజు పరిశీలించారు. ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటన పై సమగ్ర నివేదికను అందచెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ వేగ నియంత్రణ, ప్రమాద హెచ్చరికల సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సమన్వయ శాఖల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాలని కలెక్టర్ తెలియజేశారు.

---------------------------

ఏలూరు జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల 25 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగే ఈ కార్యక్రమంపై అధికారులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచేందుకు నిర్ణయించామన్నారు. అన్ని విభాగాల సమిష్టి కృషితో ప్రతి మండలంలో 15 వేల మొక్కలు చొప్పున నాటాలని, ఇందులో ప్రజలను భాగస్వాములు చేయాలని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్ది సేపటి క్రితం ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్... 31 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా భౌగోళిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుకు, నూతన సాంకేతికతను అందుబాటులోకి తెచ్చేందుకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పేరందేవి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో నిన్న ఈ కార్యక్రమం కింద ఖరీఫ్ సీజన్ సన్నద్ధత అంశంపై రైతులతో ఆమె మాట్లాడారు.

====================